మురుగు వెళ్లే దారేదీ?

• రోగాల బారిన పడుతున్న స్థానికులు



కాలువ లేక నిల్వ చేరిన మురుగునీరు

వింజమూరులోని హిందూనగర్‌లో నారాయణ హైస్కూల్ వెనుక వైపు నివాసాల మధ్య మురుగు కాలువ వ్యవస్థను కొందరు నిర్వీర్యం చేశారు. దీంతో చాలా కాలంగా మురుగు నీరు వెళ్లే దారి లేక అక్కడే నిల్వ చేరింది. దీనివల్ల సమీప నివాసాల్లో ఉన్న వారు జ్వరాలు, వ్యాధుల బారిన పడుతున్నారు. ఎంతో విశాలమైన మురుగునీటి కాలువను కొంతమంది ఆక్రమించడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

– వింజమూరు(ఉదయగిరి)

ఏళ్లనాటి కల.. చప్టా నిర్మాణం



రామదేవులపాడు లోతు వంక వద్ద ఇదీ పరిస్థితి

వరికుంటపాడు మండలం రామదేవులపాడు– వింజమూరు మండలం జనార్ధనపురం మధ్యలో లోతు వంకపై చప్టా నిర్మాణం ఏళ్ల తరబడి కలగా మిగిలింది. ఎన్నికల వేళ వివిధ రాజకీయ పార్టీ నేతలు దీనిని పూర్తి చేస్తామని హామీ ఇస్తారు. తర్వాత ఎవరూ పట్టించుకోరు. ఫలితంగా వర్షం కురిస్తే రాకపోకలకు ఇబ్బందిగా మారింది. చిన్నపాటి వర్షం కురిసినా వాహనాలు వెళ్లే పరిస్థితి ఉండడం లేదు. పైగా ఈ చప్టా నిర్మాణం చేస్తే ఈ రెండు గ్రామాలే కాకుండా వింజమూరు, వరికుంటపాడు, కొండాపురం మండల కేంద్రాలకు తక్కువ దూరంలో అనుసంధానం ఏర్పడుతుంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు చప్టా నిర్మాణంపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

– ఉదయగిరి

మట్టిరోడ్డే దిక్కు

• ప్రమాదకరంగా రాకపోకలు



అధ్వానంగా జనార్ధనపురం-కొత్తపేట రోడ్డు

మండలంలోని జనార్ధనపురం నుంచి కొత్తపేట వరకు ఉన్న రోడ్డు అధ్వానంగా ఉంది. ఈ మట్టిరోడ్డు మార్గంలో భారీ గుంతలతో వాహనాచోదకులు హడలిపోతున్నారు. పైగా రోడ్డుకు ఇరువైపులా ముళ్ల చెట్లు పెరిగి రోడ్డును కమ్మేశాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మార్గంలో నిత్యం ఎక్కువ సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. పైగా కొండాపురం, చాకలకొండ, నర్రవాడ మీదుగా రోజూ బెంగళూరుకు ఆర్టీసీ సర్వీసులు రాకపోకలు సాగిస్తుంటాయి. అధికారులు స్పందించి కనీసం నాలుగు కిలోమీటర్ల రోడ్డులో గుంతలను పూడ్చి, ముళ్ల చెట్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. – వింజమూరు(ఉదయగిరి)

గోతుల రహదారి

• అధ్వానంగా మారిన ప్రధాన రహదారి
• అధిక ప్రాధాన్యం ఉన్నా పట్టించుకోని వైనం

కలిగిరి– కొండాపురం ప్రధాన రహదారి పలుచోట్ల గోతులమయమై అధ్వానంగా తయారైంది. దీంతో ఈ మార్గంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రహదారుల రూపురేఖలు మారుస్తామని అట్టహాసంగా ప్రకటించింది. అయితే ఈ మార్గంలో కనీసం మరమ్మతులు కూడా చేపట్టలేదు.



కలిగిరి- కొండాపురం మార్గంలో ఏర్పడిన గుంతలు

కలిగిరి : అధిక రాకపోకల దృష్ట్యా కలిగిరి నుంచి వలేటివారిపాళెం వరకు డబుల్ రోడ్డు మంజూరైంది. అధిక ప్రాధాన్యం ఉన్న ఈ రహదారికి నాలుగు నెలల క్రితం ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కొండాపురం మండలంలో నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ నత్తనడకన పనులు చేయిస్తున్నారు. కొత్త రహదారి మంజూరు కావడంతో దెబ్బతిన్న రోడ్డుకు ఆయా ప్రాంతాల్లో మరమ్మతులు చేయించడానికి అధికారులు కూడా చర్యలు తీసుకోవడం లేదు.

మండల కేంద్రంలో దయనీయం

కలిగిరి – కొండాపురం మార్గానికి సంబంధించి మండల కేంద్రమైన కలిగిరిలో పరిస్థితి దయనీయంగా ఉంది. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డుపై నీరు నిలిచి గుంతలు కనిపించక తరచూ ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కుడుములదిన్నెపాడు, చిన్నఅన్నలూరు, జంగాలపల్లి సమీపంలోని వాగులపై ఉన్న చప్టాల వద్ద పరిస్థితి మరింత దుస్థితిలో ఉంది. రోడ్లు పూర్తిగా దెబ్బతిని ఉన్నాయి. ఆ మార్గంలో రాకపోకలు సాగించాలంటే వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రాత్రి సమయంలో ఈ మార్గంలో కొత్తగా రాకపోకలు సాగించే వారు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నూతన రహదారి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో కనీసం ఇబ్బందికరంగా ఉన్న ప్రాంతాల్లో మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందిగా ఉంది



రోజూ కలిగిరికి ఏదో ఒకపని నిమిత్తం వెళ్లాల్సి వస్తోంది. ఇక్కడ కొద్దిపాటి వర్షం కురిసినా రోడ్డుపై నీరు నిలుస్తోంది. గోతులు కనిపించడం లేదు. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కనీసం మరమ్మతులైనా చేపట్టాలి.

– తానుపర్తి సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డిపాళెం, కలిగిరి మండలం

వెంటనే చేయిస్తాం

కలిగిరిలో సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నాం. వర్షపు నీరు గ్రామం బయటకు వెళ్లేలా చర్యలు తీసుకుంటాం. ప్రధాన ప్రాంతాల్లో వెంటనే మరమ్మతులు చేసి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

– అహ్మద్‌బాషా, ఆర్‌అండ్‌బీ ఏఈ, కలిగిరి

గంగమ్మ తల్లికి పొంగళ్ల సమర్పణ



పొంగలి సామగ్రితో ఊరేగింపుగా వచ్చిన భక్తులు

ఉదయగిరి రూరల్ : ఉదయగిరి మండలంలోని గండిపాళెం గ్రామంలో జలాశయం వద్ద నూతనంగా నిర్మించిన గంగమ్మ తల్లి ఆలయంలో భక్తులు ఆదివారం అమ్మవారికి పాలపొంగళ్లు పొంగించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం పొంగలి సామగ్రిని కొత్తబుట్టలో పెట్టుకుని బాణసంచా, డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని ప్రదక్షిణల అనంతరం పొంగళ్లు పొంగించి నైవేద్యాలు సమర్పించారు. అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలు సమృద్ధిగా కలగాలని ప్రజలు వేడుకున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉదయగిరి రూరల్ : మండలంలోని బిజ్జంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2004–05 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన వారు 20 ఏళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనాన్ని హెచ్‌ఎం నాయుబ్‌రసూల్ అధ్యక్షతన ఆదివారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మస్తాన్‌వలీ, శ్రీనివాసులు పాల్గొని, మాట్లాడారు. చిన్ననాటి ఉపాధ్యాయులను, క్లాస్‌మేట్స్‌ను గుర్తించుకుని ఆహ్వానించి విద్య నేర్పిన గురువులను సన్మానించడం, అలనాటి మధుర స్మృతులను పంచుకోవడం చాలా గొప్ప విషయమన్నారు. ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలు పాఠశాల అభివృద్ధికి అన్నివిధాలా తోడ్పడుతాయన్నారు. అనంతరం గురువులను సన్మానించి సత్కరించారు. సహపంక్తి భోజనాలు చేశారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్, సరస్వతీదేవి చిత్రపటాలకు పూలమాల వేసి స్మరించుకున్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఈఓ గానుగపెంట ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తల్లులను గౌరవించుకోవడం మన బాధ్యత



కావలిలోని జనతాపేట అంగన్‌వాడీ కేంద్రంలో తల్లికి వందనం చేస్తున్న చిన్నారులు

కావలి(జలదంకి): జన్మనిచ్చిన తల్లులను గౌరవించుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత అని సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి అన్నారు. కావలి పట్టణంలోని జనతాపేట అంగన్‌వాడీ కేంద్రంలో తల్లికి వందనం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మాలకొండారెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయకుండా వృద్ధాప్యంలో వారిని గౌరవంగా పోషించాలని సూచించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులు వారి తల్లులకు పాదపూజ చేసి గౌరవించారు. అలాగే తల్లులు చిన్నారులను ఆశీర్వదించారు. అంగన్‌వాడీ వర్కర్లు స్వర్ణ, సునీత పాల్గొన్నారు.

వైభవంగా..



వింజమూరు(ఉదయగిరి) : మండలంలోని చాకలకొండలో సీతారాముల కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం హనుమంత సేవ వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

భారత సైన్యం సత్తా ప్రపంచానికి తెలిసింది

జలదంకి : ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత సైన్యం సత్తా ప్రపంచానికి తెలిసిందని బీజేపీ యువ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్డే శ్రీనాథ్‌రెడ్డి అన్నారు. ఆయన జలదంకి బీజేపీ కార్యాలయంలో ఆదివారం మాట్లాడారు. ఉగ్రవాదంపై పోరుకు ప్రజలు ఎల్లప్పుడూ మద్దతుగా నిలుస్తారని తెలిపారు. అలాగే దేశరక్షణలో ప్రాణాలర్పించిన వీరజవాన్ మురళీనాయక్‌కు జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు కిశోర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి వంటేరు రాకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

అధినేతను కలిసిన మేకపాటి



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి : వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బెంగళూరులోని ఆయన నివాసంలో ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా రాజకీయ పరిస్థితుల గురించి, నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి గురించి వివరించారు.

కన్యకాపరమేశ్వరికి 14 నుంచి కుంభాభిషేకం

కావలి(జలదంకి): కావలి పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయ పునఃప్రతిష్ఠ కుంభాభిషేక మహోత్సవాలు ఈనెల 14 నుంచి 18వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ పాలకవర్గ, కార్యవర్గ సభ్యులు ఆదివారం తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

స్పోకెన్ ఇంగ్లిష్‌పై శిక్షణ



సోమశిల : అనంతసాగరం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, గణితంపై శిక్షణ ఇచ్చినట్లు లైబ్రేరియన్ నారాయణరావు తెలిపారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా ఆయన మాట్లాడుతూ మాతృభాష తెలుగు అయినప్పటికీ ఆంగ్లంలో కూడా ప్రావీణ్యం కలిగి ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు క్రికెట్, నృత్య పోటీలు నిర్వహించినట్లు తెలిపారు.

నేత్రపర్వంగా హనుమంత సేవ



స్వామివారికి లక్ష కుంకుమార్చన గావిస్తున్న మహిళలు



హనుమంత వాహనంపై స్వామివారు

వింజమూరు(ఉదయగిరి) : మండలంలోని నల్లగొండ్లలో ఉన్న నీలగిరి కొండపై కొలువైన లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు హనుమంతసేవ నేత్రపర్వంగా సాగింది. ఆలయ ప్రధానార్చకుడు పరాకుశం సత్యనారాయణాచార్యులు అధ్వర్యంలో వేద పండితులు ఉదయం 6 నుంచి స్వామివారికి నిత్య హోమాలు, హనుమ గాయత్రి హోమాలు, ఉత్సవ మూర్తులకు అభిషేక కంకైర్యం చేశారు. 108 మంది మహిళలు లక్ష కుంకమార్చన, తిరుప్పావడ సేవ జరిపించారు. రాత్రి ఆంజనేయస్వామికి సహస్ర నామార్చన గావించారు. అనంతరం స్వామివారు హనుమంత వాహనంపై రామావతారంలో పుర వీధుల్లో భక్తులను కటాక్షించారు. గ్రామంలో ఉన్న పడమటి వీధివారు ఉభయకర్తలుగా అన్నదానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా టీవీ యాంకర్లు, బుల్లితెర నటులతో వినోద కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు గరుడ సేవ

బ్రహ్మోత్సవాలల్లో భాగంగా నాలుగో రోజు బంగారు గరుడ సేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఆలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ చినకొండారెడ్డి, ఈఓ శాంతయ్య ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

నృసింహునికి గరుడసేవ



గరుడ వాహనంపై స్వామివారు

ఆత్మకూరు : నృసింహ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని బొగ్గేరు సమీపంలో ఉన్న పెంచల నరసింహస్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. తొలుత స్వామివారిని విశేష ద్రవ్యాలతో అభిషేకాలు చేసి సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం పెంచల నరసింహస్వామి, చెంచులక్ష్మి, ఆదిలక్ష్మి ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు కల్యాణం

పట్టణంలోని పెంచలస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. అనంతరం అన్నప్రసాద వితరణ ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



ఆత్మకూరు : పట్టణంలోని కేకేఆర్ ఆస్పత్రిలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. కౌన్సిలర్ గౌస్‌బాషా కుమారుడు తోహిద్ ప్రథమ వర్ధంతి సందర్భంగా అతని మిత్రులు సుమారు 40 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం, కేకేఆర్ ఆస్పత్రి డాక్టర్ సుధాకర్ రెడ్డి రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షించారు. అనంతరం బీఎస్సార్ సెంటర్‌లో పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి సాధిక్, సీహెచ్ వెంకట సుబ్బానాయుడు, ఎన్నారై మీరామొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కుంభాభిషేక మహోత్సవం



సంగం : మండలంలోని మర్రిపాడు గ్రామంలో ఉన్న గంగమ్మ తల్లి ఆలయంలో గ్రామస్తులు కుంభాభిషేక మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేసి శిఖర ప్రతిష్ఠ, విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో గావించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రామిరెడ్డి ఆశీర్వాదం



రమ్యశ్రీని ఆశీర్వదిస్తున్న ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి(జలదంకి): కావలి పట్టణ, రూరల్ మండలంలో ఆదివారం జరిగిన పలు వివాహ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. పట్టణంలోని మూడో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మండలి కృష్ణారావు కుమార్తె రమ్యశ్రీ నిశ్చితార్థ వేడుకల్లో పాల్గొని ఆశీర్వదించాడు. పదో వార్డుకు చెందిన ఆత్మకూరి చెంచలరావు కుమార్తె నలుగు కార్యక్రమంలో రామిరెడ్డి పాల్గొన్నారు. అలాగే కావలి రూరల్ మండలం గౌరవరం వైఎస్సార్‌సీపీ నాయకుడు బండ్లమూడి కొండయ్య కుమారుడి వివాహం ఇటీవల జరిగిన నేపథ్యంలో వారి నివాసానికి వెళ్లి వధూవరులను ఆశీర్వదించాడు. అలాగే గౌరవరం వైఎస్సార్‌సీపీ నాయకుడు పైడిపాటి కార్తీక్ వివాహ వేడుకల్లో రామిరెడ్డి పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

మల్లికార్జున స్వామి కల్యాణం నేడు

కావలి(జలదంకి): కావలి మండలం బడుమగుంట క్రాస్‌రోడ్డులోని కామాక్షితాయి గంగాభవాని సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో సోమవారం కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త ద్రోణాదుల వెంకట కృష్ణారెడ్డి ఆదివారం తెలిపారు. ఆలయ ప్రాంగణంలో అన్నదాన వితరణ ఉంటుందన్నారు. భక్తులు విశేషంగా పాల్గొనాలని కోరారు.

క్లుప్తంగా

మంచాలపల్లిలో వైద్య శిబిరం



సోమశిల : అనంతసాగరం మండలం మంచాలపల్లి గ్రామంలో డాక్టర్ సుందరంమూర్తి ప్రజావైద్యశాల ఆధ్వర్యంలో బిగ్‌టీవీ సహకారంతో మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. స్థానికులే కాకుండా వివిధ గ్రామాల నుంచి 150 మంది వైద్యసేవలను వినియోగించుకున్నారని నిర్వాహకులు తెలిపారు.

ఆపరేషన్ సిందూర్ విజయవంతానికి పూజలు



జలదంకి: ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని జలదంకిలోని పోలేరమ్మ ఆలయంలో బీజేపీ మండలాధ్యక్షుడు ముడి కిశోర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సైనికులకు, దేశానికి, మోదీకి మద్దతుగా పూజలు చేశారు. ఈ సందర్భంగా కిశోర్‌రెడ్డి మాట్లాడుతూ దేశ ప్రజలు, సైనికులు క్షేమంగా ఉండాలని పూజలు చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్ర కిసాన్ మోర్చా నాయకుడు చల్లా హనుమారెడ్డి, బీజేపీ నేతలు మాతిన వెంకట్రావ్, బాల కోటయ్య, చీదర్ల మల్లికార్జున పాల్గొన్నారు.

ఉదయగిరి వాసికి జాతీయస్థాయి పదవి



ధ్రువీకరణ పత్రం అందుకొంటున్న అహ్మద్‌బాషా

ఉదయగిరి : పట్టణంలోని ఆస్థాన ఖాదరియా సంస్థాన అధ్యక్షుడు అహ్మద్‌బాషాకు జాతీయ స్థాయిలో ఏఐఎస్‌ఎస్సీ స్వచ్ఛంద సంస్థలో ప్రధాన కార్యదర్శి పదవి వరించింది. రాజస్థాన్ రాష్ట్రంలోని అజ్మీర్‌లో శనివారం జరిగిన సదస్సులో సంస్థ చైర్మన్ సయ్యద్ నసిరుద్దీన్ చిష్తి జారీ చేసిన ధ్రువీకరణ పత్రాన్ని అహ్మద్‌బాషా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం సమాజ అభివృద్ధి, లౌకిక వాదాన్ని బలపరుస్తూ, దేశ సమైక్యత, సమగ్రతలను పెంపొందించే లక్ష్యంతో తమ సంస్థ పనిచేస్తోందని తెలిపారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు



సాక్షి ఎఫెక్ట్..

సోమశిల : అనంతసాగరం మండల పరిధిలోని మంచాలపల్లి గ్రామంలో అక్రమంగా జరుగుతున్న గ్రావెల్ మాఫియా, అధికారులకు లంచాలపై సాక్షి దినపత్రికలో 'అధికారులకు లంచం ఇస్తే చాలు' అనే శీర్షికన శుక్రవారం ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా మట్టి తోలుతున్న భూమి వద్ద హెచ్చరిక బోర్డును ఆదివారం ఏర్పాటు చేశారు. ఇకపై మండల పరిధిలో ఎక్కడైనా గ్రావెల్ తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సుభాషిణి హెచ్చరించారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గంలోని 22 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదివారం అందజేశారు. నెల్లూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో రూ.37,25,213 విలువ గల చెక్కులను బాధితులకు అందించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

గిరిజన కాలనీలో అన్నదానం



ఆత్మకూరు: పట్టణానికి చెందిన ఐక్య ఫౌండేషన్ నిర్వాహకుడు శివుని రవీంద్రారెడ్డి సహకారంతో గిరిజనకాలనీలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రవీంద్రారెడ్డి తన తల్లి రమణమ్మ వర్ధంతిని పురస్కరించుకుని ఐక్య ఫౌండేషన్ ద్వారా కార్యక్రమాన్ని చేపట్టారు.